
సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం ၊ 19 ၊ మార్చి ၊ 2024





..రైతుల ఆందోళన

కేఎస్పీ నుంచి పంటలకు నీరు అందడం లేదని రైతులు ఆందోళన చేశారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 38.9 /22.5

ఆకాశం అప్పడప్పుడు మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

లక్ష్యం చేరుకోకపోతే కఠిన చర్యలు



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'ఆర్థిక సంవత్సరం ముగియడానికి కేవలం 12 రోజులు మాత్రమే మిగిలి ఉంది. గడువులోగా ఆస్తి పన్ను వసూళ్లలో లక్ష్యం చేరుకోవాలి.. లేదంటే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు..' అని అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ హెచ్చరించారు. సోమవారం రాత్రి మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌ఐలు, బిల్‌కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఇప్పటివరకు కేవలం 36శాతమే వసూలు కావడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరూ నిత్యం కనీసం రూ.రెండు లక్షలైనా వసూలు చేయాల్సిందేనని ఆదేశించారు. పాతబకాయిలపై 90శాతం వడ్డీ రాయితీ పోను మొత్తం రూ.17 కోట్లు రావాల్సి ఉండగా రూ.13 కోట్లే రావడంపై మండిపడ్డారు. 2023–24కు గాను రూ.ఆరు కోట్లు పూర్తిగా రాబట్టాల్సిందేనన్నారు. కనీసం రూ.నాలుగు కోట్లు వస్తేనే 15వ ఆర్థిక సంఘం నుంచి మ్యాచింగ్ గ్రాంట్ వెంటనే విడుదలవుతుందన్నారు. ఆ దిశగా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం ఇదే విషయమై రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి సమీక్షించారు. ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. సమావేశంలో ఏఎంసీ జె.పవన్‌కుమార్, ఆర్‌ఐలు నర్సింహులు, ముజీబ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటాల్ రూ.7,336

జడ్చర్ల/దేవరకద్ర: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం వేరుశనగకు క్వింటాల్ గరిష్ఠంగా రూ.7,336, కనిష్ఠంగా రూ.4,513 ధరలు లభించాయి. అదేవిధంగా పెబ్బర్లు గరిష్ఠంగా రూ.7,011, కనిష్ఠంగా రూ.6,111, మొక్కజొన్న గరిష్ఠంగా రూ.2,224, కనిష్ఠంగా రూ.1,908, ఆముదాలు గరిష్ఠంగా రూ.5,970, కనిష్ఠంగా రూ.5,849, మినుములు రూ.8,611, జొన్నలు గరిష్ఠంగా రూ.5,227, కనిష్ఠంగా రూ.4,229 ధరలు లభించాయి.


■ దేవరకద్ర మార్కెట్ యార్డులో ఆముదాల ధర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.5,569, కనిష్ఠంగా రూ.5,550గా నమోదయ్యాయి. సీజన్ లేకపోవడం వల్ల కేవలం వంద బస్తాల ఆముదాలు అమ్మకానికి వచ్చాయి.

తప్పుడు ప్రచారం వెనక ప్రతిపక్షాల కుట్ర

- బీజేపీలో జితేందర్‌రెడ్డికి సముచితస్థానం
- శ్రీనివాస్‌గౌడ్ బీజేపీలో చేరుతారనేది అవాస్తవం: డీకే అరుణ

పాలమూరు: మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బీజేపీలో చేరుతారనేది కేవలం ఊహాగానాలు మాత్రమేనని, ఇది ప్రతిపక్ష పార్టీల కుట్ర పూరితంగా ప్రచారం చేస్తున్నారని, ఇందులో ఎలాంటి వాస్తవం లేదని మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ ఖండించారు. జిల్లాకేంద్రంలో ఆమె నివాసంలో సోమవారం మాట్లాడుతూ మొదటి నుంచి బీజేపీ ఏపీ జితేందర్‌రెడ్డికి కావాల్సిన గుర్తింపు ఇచ్చిందని, జాతీయస్థాయిలో అత్యున్నత పదవి, ఢిల్లీలో కోర్ కమిటీ సమావేశాల్లో అవకాశం ఇచ్చిందన్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో నన్ను పోటీ చేయాలని చాలామంది అడిగినా.. జితేందర్‌రెడ్డి అడిగారని ఆయన కుమారుడికి మహబూబ్‌నగర్ టికెట్ ఇచ్చినట్లు తెలిపారు. ఎవరూ లేకపోతే మాకు టికెట్ ఇచ్చారని చెప్పడం సరికాదన్నారు. ఒకరోజు వ్యవధిలో ప్లేట్ ఫిరాయించి బీజేపీపై మాట్లాడిన తీరు ప్రజలు గుర్తించాలన్నారు. జితేందర్‌రెడ్డికి సంబంధించి ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారిందని, దీనిపై వారే సమాధానం చెప్పాలన్నారు. మహబూబ్‌నగర్ బీజేపీలో పని చేసిన చాలా మంది సీనియర్ నాయకులు పార్టీ వదిలి వెళ్లిపోవడానికి ఆయనే కారణమన్నారు. పార్టీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని మంగళవారం నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో, మండల, పట్టణాల్లో ఈనెల 20నుంచి పార్టీలో చేరికలు భారీగా ఉంటాయన్నారు. నాగర్‌కర్నూల్‌లో ప్రధాని మోదీ సభను విజయవంతమైందని, భారీ ఎత్తున ప్రజలు తరలివచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. పద్మజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, అంజయ్య, రాజేందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాచాల శ్రీధర్ పాల్గొన్నారు.





- ఆస్తిపన్ను చెల్లింపుదారుల్లో కొరవడిన చైతన్యం
- పాలమూరులో ఓటీఎస్‌కు 15,270 మంది అర్హులు
- ఇప్పటివరకు చెల్లించినవారు కేవలం 1,100 మందే
- వసూళ్ల కోసం 4 మున్సిపల్ బృందాల ఏర్పాటు

వడ్డీ రాయితీపై స్పందన అంతంతే!



హబీబ్‌నగర్‌లోని ఆస్తిపన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ అధికారులు (ఫైల్)

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలోని పాలమూరు, జడ్చర్ల, భూత్పూర్ మున్సిపాలిటీల పరిధిలో ఆస్తిపన్ను బకాయిలు పేరుకుపోయాయి. వీటి రికవరీ కోసం రాష్ట్ర ప్రభుత్వం గత నెల 27న వడ్డీపై 90 శాతం రాయితీ (వన్ టైమ్ సెటిల్‌మెంట్) ప్రకటించింది. దీనిపై మున్సిపల్ అధికారులు, సిబ్బంది పట్టణాల్లోని ముఖ్య కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ రాయితీని వినియోగించుకుని సకాలంలో ఆస్తిపన్ను పూర్తిగా చెల్లించాలని ఇంటింటికీ వెళ్లి చెల్లింపుదారులకు విన్నవిస్తున్నారు. అయినప్పటికీ స్పందన అంతంత మాత్రమే వస్తోంది. మహబూబ్‌నగర్‌లోని రామయ్యబౌలి, పాతపాలమూరు, వీరన్నపేట, న్యూగంజ్, రవీంద్రనగర్, హనుమాన్‌పురా, టీడీగుట్ట, మోతీనగర్, షాషాబ్ గుట్ట తదితర ప్రాంతాల నుంచి ఎక్కువ బకాయిలు ఉన్నాయి. కొన్ని రోజులుగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది నాలుగు బృందాలుగా ఏర్పడి ఆస్తి పన్ను వసూలు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం (2023–24) ముగియడానికి కేవలం 13 రోజుల గడువు మిగిలింది. ఆ లోగా లక్ష్యం చేరుకోవాల్సిందేనని ఇటీవల స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆదేశించారు. కాగా, జడ్చర్ల, భూత్పూర్ మున్సిపాలిటీల పరిధిలో ఇప్పటికే 60 శాతానికి పైగా వసూలు కావడం గమనార్హం.

మున్సిపాలిటీల వారీగా ఇలా..

■ మహబూబ్‌నగర్ పట్టణంలో 49,909 గృహాలు, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. వీటి నుంచి ఈ ఏడాది ఆస్తిపన్ను రూ.18.72 కోట్లు రావాల్సి ఉంది. అలాగే పాత బకాయిల కింద రూ.29.20 కోట్లు ఇలా మొత్తం రూ.47.92 కోట్లు రావాల్సి ఉంది. ఇక వడ్డీ రాయితీకి 15,270 మంది అర్హులు కాగా కేవలం 1,100 మంది మాత్రమే వినియోగించుకున్నారు. ఇప్పటివరకు మొత్తం 23,951 మంది నుంచి రూ.14.80 కోట్లు (36 శాతం) వచ్చింది. మరోవైపు పాత బకాయిల్లో 90 శాతం (ఓటీఎస్) కింద రూ.26.28 కోట్లు మాఫీ కానుంది.

■ జడ్చర్ల పట్టణంలో 17,840 గృహాలు, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. వీటి నుంచి ఈ ఏడాది ఆస్తిపన్ను రూ.3.05 కోట్లు రావాల్సి ఉంది. అలాగే పాత బకాయిల కింద రూ.1.02 కోట్లు ఇలా మొత్తం రూ.4.07 కోట్లు రావాలి. ఇక వడ్డీ రాయితీకి 128 మంది అర్హులు కాగా 50 మందే వినియోగించుకున్నారు. ఇప్పటి వరకు మొత్తం10,853 మంది నుంచి రూ.2,48,86,000 (61 శాతం) వచ్చింది. మరోవైపు పాత బకాయిల్లో 90 శాతం (ఓటీఎస్) కింద రూ.91.80 లక్షలు మాఫీ కానుంది.

■ ఇక భూత్పూర్ పట్టణంలో 3,469 గృహాలు, వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. వీటి నుంచి ఈ ఏడాది ఆస్తిపన్ను రూ.1,85,50,000 రావాల్సి ఉంది. అలాగే పాత బకాయిల కింద రూ.49,78,000 ఇలా మొత్తం రూ.2,35,28,000 రావాలి. ఇక వడ్డీ రాయితీకి 1,395 మంది అర్హులు కాగా సుమారు 500 మంది వినియోగించుకున్నారు. ఇప్పటివరకు సుమారు 2,000 మంది నుంచి రూ.1.54 కోట్లు (62 శాతం) వచ్చింది. మరోవైపు పాత బకాయిల్లో 90 శాతం (ఓటీఎస్) కింద రూ.44.80 లక్షలు మాఫీ కానుంది. ఇదిలాఉండగా తమకు ఎక్కువ ఆస్తిపన్ను విధిస్తున్నారని.. తగ్గించాలంటూ ఇటీవల దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి స్థానికులు విన్నవించారు.

అందరూ సద్వినియోగం చేసుకోవాలి

ఆస్తిపన్నుపై 90శాతం వడ్డీ రాయితీని అందరూ సద్వినియోగం చేసుకోవాలి. పట్టణంలో ఓటీఎస్‌పై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ముఖ్య కూడళ్లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశాం. గడువులోగా ఎలాంటి బకాయిలు లేకుండా ఆస్తిపన్ను చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలి. సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికీ ఇంటింటికీ వెళ్లి ఎక్కడికక్కడే పన్ను వసూలుకు యత్నిస్తున్నాం.

– డి.మహేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్



కూలిన ఇంటి స్థలంలోనే తన పిల్లలతో దివ్యాంగురాలు లక్ష్మి

దివ్యాంగురాలి దీనగాథ

వేలిముద్రలు పడక.. ఐరిష్‌లో కనుపాప రాక

ఆమెకు పుట్టుకతోనే చెవులు వినిపించవు.. ఓ కన్ను కనిపించదు..కట్టుకున్న భర్త సైతం నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. అయినప్పటికీ ఇటు దివ్యాంగుల పింఛన్ కానీ, అటు వితంతు పింఛన్ కానీ రాదు.. ఇంతవరకు ఈమెను విధి మాత్రమే పగబట్టింది అనుకున్నారేమో.. సాంకేతిక పరిజ్ఞానం సైతం ఈమెను చిన్నచూపే చూస్తోంది.. ఎందుకంటే, కూలీనాలీ చేసుకుని జీవించే ఈమెకు వేలి ముద్రలు పడక.. ఓ కన్ను కనిపించక ఐరిష్ సైతం తీసుకోక.. ఇప్పటి వరకు ఆధార్ కార్డు లేని ఏకైక మహిళ ఈమె. ఫలితంగా అన్ని రకాల ప్రభుత్వ పథకాలకు ఆధార్ కార్డు కీలకం కావడంతో.. ఈమెకు ఏ పథకం కూడా అందకుండాపోతోంది. దీంతో తన ఇద్దరు పిల్లలతో కలిసి కూలిపోయిన ఇంటి ముందు బతుకు బండిని నెట్టుకొస్తోంది. – కోస్గి

- సంవత్సరాలు గడుస్తున్నా అందని ఆధార్ కార్డు
- ఫలితంగా ప్రభుత్వ పథకాలకు దూరమైన అభాగ్యురాలు

చెవులు వినబడవు.. కన్ను కనబడదు

కోస్గి మున్సిపల్ పరిధిలోని మాసాయపల్లికి చెందిన ఊరుముందలి లక్ష్మికి చెవులు వినబడవు.. ఓ కన్ను కనబడదు. ఈ క్రమంలో ఆధార్ కార్డు కోసం వెళ్తే వేలిముద్రలు రావడం లేదు. దీంతో ఎన్నో సంవత్సరాలుగా ఆధార్ కార్డు లేకపోవడంతో రేషన్ బియ్యం ఇవ్వడం లేదు. ఆమె భర్త నర్సింహులు చనిపోయి నాలుగేళ్లు గడిచినప్పటికీ ఆధార్ కార్డు లేదనే కారణంతో కనీసం వితంతు పింఛన్ సైతం ఇవ్వడం లేదు. ఆధార్ కోసం అధికారుల చుట్టూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకునే వారు లేక అర్హతలున్నప్పటికి ఎలాంటి ప్రభుత్వ పథకాలకు నోచుకోక.. మా కర్మ ఇంతే అనుకుంటూ కూలీగా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తుంది.

నిలువ నీడ కరువు

పుట్టుకతో చెవులు వినబడని, ఓ కన్ను కనబడని దివ్యాంగురాలైన లక్ష్మికి ఎలాంటి ఆధారం లేకుండా పోయింది. మూలిగే నక్కమీద తాటి కాయ పడ్డ చందంగా శిథిలావస్థకు చేరిన ఇల్లు సైతం వారంరోజుల క్రితం కూలిపోవడంతో ఉండటానికి గూడు లేక బతుకు మరింత దుర్భరంగా మారింది. పింఛన్ రాకపాయె.. పాత ఇల్లు కూలిపాయె అంటూ కూలిన ఇంటి స్థలంలోనే వంట సామగ్రి ఉంచుకొని బతుకు జీవుడా అంటూ ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది.

ముఖ్యమంత్రికి తెలిస్తే..



ఆధార్ కార్డు లేకపోవడంతో మా కర్మ ఇంతే ఉందనుకొని కష్టం చేసుకొని బతుకుతున్నాం. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిండని మా పిల్లలు చెప్పిండ్రు. ముఖ్యమంత్రికి తెలిస్తే నా సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తారని గ్రామంలో అందరు అంటున్నారు. నా సమస్యను పరిష్కరించి నాకు ప్రభుత్వం పింఛన్, రేషన్‌బియ్యం ఇప్పిస్తే జీవితాంతం నేను, నా పిల్లలు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం. – లక్ష్మి, దివ్యాంగురాలు

హాస్టల్‌లో ఉండి చదువుకున్నా

ఇంటి పరిస్థితి సరిగా లేకపోవడంతో కేజీబీవీలో ఉండి పదో తరగతి పూర్తిచేశా. ప్రస్తుతం నేను కోస్గి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, మా తమ్ముడు 8వ తరగతి చదువుతున్నాడు. మా అమ్మకు ఆధార్ కార్డు కోసం అన్ని ఆఫీసులకు తిరిగినా లాభం లేదు. మా సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు. కలెక్టర్ సార్ అనుమతి ఇస్తేనే మీ అమ్మకు ఆధార్ వస్తుందని చెబుతున్నారు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ఉన్న ఇల్లు కూడా కూలిపోయింది. – సింధూజ, లక్ష్మి కూతురు

లోక్‌సభ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ రవినాయక్

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్
- కలెక్టరేట్‌లో మీడియో సెంటర్ ప్రారంభం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో లోక్‌సభ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ భవనంలో మీడియా సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ రాములుతో కలిసి మాట్లాడారు. ఈ నెల 16న భారత ఎన్నికల సంఘం పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసినందున కోడ్ అమలులోకి వచ్చిందని, జిల్లాలో శాసనమండలికి జరుగుతున్న ఉపఎన్నికల నేపథ్యంలో ఇది వరకే కోడ్ అమలులో ఉందని తెలిపారు. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ చేస్తారని, 25 వరకు నామినేషన్ల దాఖలు, 26న స్క్రూటినీ, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ, మే 13న పోలింగ్, జూన్ 4న ఓట్ల లెక్కింపు, 6వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గం లో మొత్తం 7 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 16,80,348 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 8,32,016 మంది పురుషులు, 8,48,289 మంది మహిళా ఓటర్లు, 43 మంది ఇతరులు, 1,226 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. ఇందులో కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్నవారు 58,107 మంది ఉన్నారని, 85 ఏళ్లు దాటిన వారు 6,047 మంది ఉన్నారని, వీరికోసం హోం ఓటింగ్ విధానం అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఫారం–12 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

■ ఏఎస్పీ రాములు మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గపరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఐదు అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలను సజావుగా నిర్వహించే ప్రక్రియలో భాగంగా సీఆర్‌పీఎఫ్ బెటాలియన్ ఫోర్స్ ఇప్పటికే జిల్లాకు చేరుకుందని తెలిపారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద ఫోర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్వో కేవీవీ రవికుమార్ పాల్గొన్నారు.

1,916 పోలింగ్ కేంద్రాలు


జిల్లాలో మొత్తం 1,916 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. కౌంటింగ్‌కు పాలమూరు యూనివర్సిటీలో ఏడ్లు హాళ్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 50 శాతం పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహించనున్నట్లు చెప్పారు. 21 ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఈసీ ఆదేశాల మేరకు స్టాటిక్ సర్వేలెన్స్, ఫ్లయింగ్ సర్వేలెన్స్, వీడియో నిఘా బృందాలను ఏర్పాటు చేశామని, ఈ బృందాలు 24 గంటలు నిఘాలో ఉంటాయన్నారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు 18 మంది నోడల్ అధికారులను నియమించామన్నారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. ఏమైనా ఫిర్యాదులు, సూచనలు ఉంటే ఎన్‌జీఆర్‌ఎస్ పోర్టల్, 1950కు ఫోన్ చేసి, సీ విజిల్ యాప్‌లో సమాచారం ఇవ్వవచ్చని పేర్కొన్నారు. సీవిజిల్ యాప్‌లో నమోదైన ఫిర్యాదులు 100 నిమిషాల్లో పరిష్కారం చేస్తామన్నారు. అనుమతుల కోసం సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతిపాదిత రాజకీయ ప్రకటనల కోసం మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ వద్ద అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు.



నంబర్లు చేసుకుంటున్న విద్యార్థులు



పాలమూరు మాడ్రన్ హైస్కూల్‌లో..



మహబూబ్‌నగర్‌లోని గాంధీరోడ్ పాఠశాలలో విద్యార్థులు హడావుడి

12,689 మంది హాజరు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఎస్సెస్సీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడంతో ఉదయం 8గంటల నుంచి పరీక్ష కేంద్రం వద్ద సందడి నెలకొంది. ఉదయం 8:30 గంటలకు విద్యార్థులకు కేంద్రంలోనికి అధికారులు అనుమతించారు. ఈ మేరకు అధికారులు జిల్లా వ్యాప్తంగా మొత్తం 59 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేయగా, అందులో సోమవారం రెగ్యులర్ విద్యార్థులు 12,711 మంది హాజరుకావాల్సి ఉండగా 43 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 27 మంది పరీక్ష రాయాల్సి ఉండగా ఆరుగురు గైర్హాజరయ్యారు. మొత్తంగా 12,738 మంది విద్యార్థులకు గాను 12,689 మంది విద్యార్థులు హాజరై 49 మంది గైర్హాజరయ్యారు. డీఈఓ రవీందర్, స్క్వాడ్ అధికారులు కేంద్రాలను తనిఖీ చేశారు.

■ పరీక్షలకు నిర్వహణకు అధికారులు విధించిన నిబంధనలు పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదు. జిల్లా కేంద్రంలోని న్యూటౌన్, తెలంగాణ చౌరస్తా, క్లాకటవర్ వంటి రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలతో పాటు, పలు మండలకేంద్రంలోని పరీక్ష సమయంలో పూర్తి స్థాయిలో జిరాక్స్ సెంటర్లను మూసివేయలేదు. జిరాక్సు సెంటర్ల వారికి అధికారులు ఎటువంటి సూచనలు చేయకపోవడంతో తెరుచుకుని ఉన్నాయి. మాడ్రన్ స్కూల్ వద్ద ఉన్న పలు జిరాక్సు సెంటర్లను పరీక్ష ప్రారంభమైన కొద్ది సేపటికి అక్కడ ఉన్న పోలీసులు మూసివేయించారు.

పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్



దేవరకద్ర పట్టణానికి సమీపంలోని మహబూబ్‌నగర్ వెళ్లే దారిలో మిషన్ భగీరథ పైపులైన్ సోమవారం పగలడంతో నీరు ఉవ్వెత్తున ఎగిసిపడింది. ఈ విషయమై మిషన్ భగీరథ అధికారులకు సమాచారం ఇవ్వడంతో నీటి సరఫరా నిలిపివేశారు. అయితే అప్పటికే పెద్ద ఎత్తున నీరంతా వృథాగా పారింది. పైపులు పగిలిన కారణంగా మరమ్మతు పనులు సాయంత్రం వరకు కొనసాగాయి. పనులు పూర్తి కాకుంటే దేవరకద్ర, మక్తల్, నారాయణపేట ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచేపోయే అవకాశం ఉంది. – దేవరకద్ర

క్లుప్తంగా

పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య

తెలకపల్లి: పురుగు మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని గట్టునెల్లికుదురు చెందిన పేర్ల విష్ణు, పిట్టల యాదయ్య కుటుంబాల మధ్య గొడవ జరిగింది. పిట్టల ఆంజనేయులు పేర్ల విష్ణుకు ఫోన్ చేసి నీ కుమారుడు ప్రశాంత్ అంతు చూస్తామని బెదిరించారు. దీంతో ప్రశాంత్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విష్ణు కుమారుడు ప్రశాంత్ (18) భయపడి తన పొలంలో ఆదివారం రాత్రి పురుగు మందు తాగి పొలంలోనే మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రశాంత్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడు దుర్మరణం


ఉడతనూరి నర్సింహ (ఫైల్)

బల్మూర్: విద్యుదాఘాతానికి గురై చెంచు సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఉడతనూరి నర్సింహ (65) దుర్మరణం చెందిన ఘటన సోమవారం మండలంలోని కొండనాగులలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు.. సోమవారం సాయంత్రం తన ఇంటి ఆవరణలోని తీగపై నర్సింహ టవల్‌ను ఆరవేస్తుండగా ఎర్తింగ్ సమస్యతో ఒక్క సారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. అతన్ని ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేయగా అప్పటికే మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ట్రైకార్డు డైరెక్టర్‌గా, ప్రస్తుతం చెంచు సేవా సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

- ఒకరి దుర్మరణం


ఆంజనేయులు (ఫైల్)

కృష్ణా: ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈఘటన కృష్ణా సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని తంగిడి గ్రామానికి చెందిన ఆంజనేయులు (42) గుడెబల్లూర్‌లో ఓ శుభకార్యానికి బైక్‌పై వెళ్లి, రాత్రి 10:30 గంటల సమయంలో స్వగ్రామానికి బయల్దేరాడు. ఈక్రమంలో మాగనూర్ మండలం నేరడగం గ్రామానికి చెందిన గుంట గణేష్ బైక్‌పై నిర్లక్ష్యంగా వస్తూ, కృష్ణా సమీపంలో ఆంజనేయులు బైక్‌ను ఢీకొట్టాడు. ప్రమాదంలో ఆంజనేయులుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ నవీద్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

జడ్చర్ల: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఓ మహిళ అనుమానాస్పదంగా మృతిచెందింది. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. జిల్లాలోని నాగసాలు గ్రామానికి చెందిన పుల్లగిరి నాగరాణి(35)ని అదే గ్రామానికి చెందిన వెంకటయ్యతో వివాహమైంది. ఆదివారం రాత్రి జడ్చర్ల బస్టాండ్ సమీపంలో నాగరాణి అనుమానాస్పదంగా మృతి చెంది ఉండడాన్ని స్థానిక పోలీసులు గమనించి మృతదేహాన్ని బాదేపల్లి ఆసుపత్రి మార్చురీకి తరలించి మృతురాలి తల్లి వెంకటమ్మకు సమాచారం ఇచ్చారు. దీంతో సోమవారం మార్చురీలో ఉన్న తన కూతురు నాగరాణి మృతదేహాన్ని పరిశీలించి మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్ ఢీకొని వ్యక్తి..

హన్వాడ: మండల కేంద్రం శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నాయినోనిపల్లి గ్రామానికి చెందిన చెంచు బుచ్చన్న(50) సోమవారం హన్వాడకు వస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. అయితే ఎదురుగా వస్తున్న బుచ్చన్నను ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో తలపగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. ఇరువురు ఒకే గ్రామానికి చెందినవారు కావడంతో విషయం పోలీసులకు ఫిర్యాదు చేయలేదని తెలిసింది. దీనిపై ఎస్‌ఐ వెంకటేష్‌ను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు. బుచ్చన్నకు మతిస్థిమితం సరిగా లేదని, ఊరూరు తిరుగుతూ యాచన చేస్తూ జీవనం సాగిస్తాడని స్థానికులు చెప్పారు.

రైలు ఢీకొనడంతో..

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కేంద్రంలోని వీరన్నపేటకు చెందిన అన్వర్‌పాషా (50) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ వివరాల మేరకు.. ఆదివారం రాత్రి సయ్యద్ అక్బర్ వీరన్నపేట వద్ద రైల్వేగేట్ దాటుతున్న క్రమంలో ప్రమాదశాత్తు రైలు ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. అతడిని జిల్లా జనరల్ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

రూ.15 వేలకు కొని

రూ.25 వేలకు అమ్మకం

- యువతిని బలవంతంగా వ్యభిచార రొంపిలోకి దింపిన మహిళలు
- వేశ్య గృహం నుంచి తప్పించుకున్న యువతి
- పోలీస్‌లకు ఫిర్యాదు.. కేసు నమోదు
- బాధిత యువతిది జోగుళాంబ గద్వాల జిల్లా



హసన్‌పర్తి: రూ.15 వేలకు కొని.. రూ.25 వేలకు అమ్మింది. ఇదేదో సంతలోని పశువునో.. ఏదైనా వస్తువో అనుకుంటే పొరపాటు. ఒంటరిగా ఉన్న యువతికి మాయమాటలు చెప్పిన ఇద్దరు మైనర్లు, వారి తల్లినుంచి ఓ మధ్యవర్తి కొన్న రేటు రూ.15 వేలు అయితే.. ఆమె తిరిగి వ్యభిచార గృహ నిర్వాహకులకు అమ్మింది రూ.25 వేలకు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లోని ఓ ప్రాంతంలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంనుంచి ఓ యువతి తప్పించుకుంది. నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు విచారణ చేపట్టిన పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఇద్దరు మైనర్లుగా పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన ఓ యువతి టెలీ కాలర్ జాబ్ నిమిత్తం ఈనెల 10వ తేదీన హైదరాబాద్ ఎంజీబీఎస్ బస్టాండ్‌లో దిగింది. ఒంటరిగా ఉండడం గమనించిన ఇద్దరు మైనర్ బాలికలు ఆమెకు మాయమాటలు చెప్పి హైదరాబాద్‌లోని తమ ఇంటికి తీసుకెళ్లారు. యువతి విషయాన్ని తల్లి మమతకు చెప్పారు. వారి మాయమాటలు నమ్మిన ఆ యువతి రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోనే ఉంది.

ఇక్కడ రూ.25 వేలకు అమ్మకం

హైదరాబాద్‌లో రూ.15 వేలకు కొనుగోలు చేసిన శివమ్మ వంగపహాడ్‌లో శ్యామ్‌రావు కావ్యకు రూ.25 వేలకు విక్రయించింది. రెండు రోజులపాటు వ్యభిచారం చేయాలని బలవంతం చేసింది. అందుకు ఆ యువతి అంగీకరించలేదు. ఈనెల 14న బాధితురాలు వ్యభిచార గృహం నుంచి తప్పించుకుంది. ఓఆర్ఆర్ వద్ద భూక్యా రాజు అనే యువకుడిని మోటార్‌సైకిల్‌పై లిఫ్ట్ తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు చేరుకుంది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చందన, మమత, ఇద్దరు మైనర్ బాలికలతో పాటు కావ్య, శివమ్మలను అరెస్ట్ చేసినట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

రూ.15 వేలకు విక్రయం

ఆ యువతిని బ్రోకర్‌గా వ్యవహరిస్తున్న గీసుకొండకు చెందిన పాకనటి శివమ్మకు రూ.15 వేలకు విక్రయించారు. మొదట శివమ్మతో వెళ్లడానికి ఆ యువతి అంగీకరించలేదు. దీంతో మమత, ఆమె సోదరి చందనలు ఆ యువతిని నిర్బంధించారు. తాడుతో చేతులు కట్టి, సెల్‌ఫోన్, బ్యాగ్‌తో పాటు అందులో ఉన్న రూ.2 వేలు లాక్కున్నారు. అనంతరం పాకనటి శివమ్మకు అప్పగించారు. ఆమె ఈ నెల 12న యువతిని కారులో ఎక్కించుకుని వంగపహాడ్‌కు చేరుకుంది.

కోయిల్‌సాగర్ వద్ద రైతుల ఆందోళన


కోయిల్‌సాగర్ ప్రాజెక్టుపై ఆందోళన చేస్తున్న రైతులు

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి విడుదల చేస్తున్న సాగు నీరు పంటలకు సక్రమంగా అందడం లేదని సోమవారం రైతులు ఆందోళన చేశారు. ప్రాజెక్టు నుంచి విడతల వారిగా నీటిని విడుదల చేయాల్సి ఉండగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కాకుండా ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారని దీని వల్ల నీరందక చివరి ఆయకట్టు కింది పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందని రైతులు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం నాల్గవ తడి 20వ తేదీ వరకు నీటి విడుదల కొనసాగించాల్సి ఉండగా రెండు రోజులు ముందుగానే సోమవారం ఉదయం నీటి విడుదలను నిలిపి వేయడానికి అధికారులు ప్రయత్నించడంతో రైతులు అడ్డుకున్నారు. పంటలు పొట్ట దశకు వచ్చాయని ఇప్పటికే నీరందక చాలా మంది రైతులు నష్టపోయారన్నారు. ఈఈ ప్రతాప్‌సింగ్, డీఈ చందు వచ్చి రైతులతో మాట్లాడారు. తాగునీటి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అందుకే నీటిని పొదుపు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు అధికారుల మధ్య కొంత సేపు వాగ్వాదం కొనసాగింది. చివరకు నీటిని మంగళవారం సాయంత్రం వరకు విడుదల చేయడానికి అధికారులు నిర్ణయం తీసుకున్నారు.


బల్సుపల్లి వద్ద నీరు లేక ఎండిపోతున్న పంటలను అధికారులకు చూపిస్తున్న రైతులు

ఆందోళనలో గూరకొండ, బల్సుపల్లి, దేవరకద్ర రైతులు పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన అధికారులు..

బల్సుపల్లి శివారులో నీరు లేక నెర్రలు విడిచిన పంట పొలాలను అధికారులు పరిశీలించారు. చివరి ఆయకట్టుకు నీరందేలా చూస్తామని అధికారులు రైతులకు హామీ ఇచ్చారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని పరిస్థితి చాలా క్లిష్టంగా ఉందని చెప్పారు. పది రోజుల విరామం తర్వాత ఐదవ చివరి తడి నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

పరీక్షకు వెళ్తుండగా ప్రమాదం

మానవపాడు: పదో తరగతి వార్షిక పరీక్షలు రాసేందుకు వెళ్తున్న ఇద్దరు విద్యార్థులు ప్రమాదానికి గురై గాయపడిన ఘటన మానవపాడు మండలం చెన్నిపాడులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని చిన్నపోతులపాడుకు చెందిన పదో తరగతి విద్యార్థులు మధు, ప్రవీణ్‌కుమార్ బైక్‌లపై మానవపాడు ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి బయల్దేరారు. ఈక్రమంలో చెన్నిపాడు సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపుతప్పి ప్రవీణ్‌కుమార్ కిందపడ్డాడు. అతడి వెనకాలే వస్తున్న మధు.. బైక్ వేగాన్ని నియంత్రించలేక ప్రవీణ్‌కుమార్‌ను ఢీకొట్టి కిందపడ్డాడు. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం మానవపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో ఇద్దరు విద్యార్థులు పరీక్ష రాయలేకపోయారు. పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటుచేయాలని తల్లిదండ్రులు కోరారు.


చికిత్స పొందుతున్న మధు, ప్రవీణ్‌కుమార్



గుర్తుతెలియని శవం లభ్యం

హన్వాడ: మండలంలోని అయోధ్యనగర్ శివారులో సోమవారం గుర్తు తెలియని శవం లభ్యమైంది. పోలీసుల కథనం ప్రకారం.. అయోధ్యనగర్ గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడి ఒంటిపై ఎలాంటి గాయాలు లేకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నాడా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుని ఒంటిపై తెల్లటి బనియన్, లుంగీ ఉన్నాయి. సంబంధీకులు ఎవరైనా ఉంటే హన్వాడ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ వెంకటేష్ కోరారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జ్ఞానేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

నీళ్లు కలపని మద్యంతాగి వ్యక్తి మృతి

గోపాల్‌పేట: నీళ్లు కలపని మద్యం తాగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ హరిప్రసాద్ వివరాల మేరకు.. గోపాల్‌పేటలోని హనుమాండ్ల గడ్డకు చెందిన కొంకలి విష్ణు (52), మరో ముగ్గురు ఆదివారం స్థానిక వైన్స్‌లో మద్యం తాగేందుకు కూర్చున్నారు. ఈక్రమంలో విష్ణు మద్యంలో నీళ్లు కలుపుకోకుండా తాగడంతో అక్కడే కిందపడిపోయాడు. చికిత్స నిమిత్తం అతడిని స్థానికులు వనపర్తి ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు కొంకలి గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, మృతుడు విష్ణు ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భార్యతో కలిసి ఎండలో కూలీ పనికి వెళ్లాడని.. అతడి భార్య సైతం అనారోగ్యానికి గురికావడంతో ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మక్తల్: మండలంలోని గుడిగండ్లకు చెందిన శేఖర్ (24) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. కొన్ని రోజులుగా అతడు ఏ పని చేయకుండా తిరుగుతుండటంతో తల్లి మందలించడంతో మనస్తాపానికి గురై వ్యవసాయ పొలంలో పురుగు మందు తాగాడు. అతడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

చౌదర్‌పల్లిలో మరో వ్యక్తి..

మహమ్మదాబాద్: పొలం విషయంలో దాయాదుల మధ్య జరిగిన గొడవలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన కాట్రావత్ లింగ్యా (48), కాట్రావత్ రాములు ఈనెల 12న తమ పొలంలో బోరు విషయమై గొడవపడ్డారు. ఈక్రమంలో రాములు లింగ్యపై పారతో దాడిచేయడంతో తలకు తీవ్రగాయమైంది. అతడిని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఈనెల 15న మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

ఎల్‌పీఎంపీకి విద్యార్థి ఎంపిక

జడ్చర్ల: మండలంలోని పోచమ్మగడ్డ తండాకు చెందిన పీజీ విద్యార్థి జ్ఞానేశ్వర్ ఎల్‌ఏఎంపీ (లెజిస్లేటివ్ అసిస్టెంట్ ఫర్ పార్లమెంట్) ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. 2024 వర్షాకాలం పార్లమెంట్ సమావేశాల నుంచి 2025 బడ్జెట్ సమావేశాల వరకు తనకు కేటాయించిన ఎంపీకి పార్లమెంట్ ప్రశ్నోత్తరాల సమయంలో సహకరించనున్నట్లు జ్ఞానేశ్వర్ తెలిపారు.

మేకపై చిరుత దాడి

ఖిల్లాఘనపురం: మేత కోసం వెళ్లిన ఓ మేకపై చిరుత దాడిచేసి, ఎత్తుకెళ్లిన ఘటన ఖిల్లాఘనపురం మండలం పర్వతాపురంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. పర్వతాపూర్‌కు చెందిన గొల్ల పెంటయ్య తన మేకల మందను గ్రామ సమీపంలోని గుట్టకు తీసుకెళ్లాడు. సాయంత్రం కంచె గుట్ట మీదుగా మేకల మందను ఇంటికి తరలిస్తుండగా.. గుట్టలో కాపుకాసుకుని ఉన్న చిరుత మందపై దాడిచేసి, ఓ మేకను ఎత్తుకెళ్లింది. చిరుత బారి నుంచి మూగజీవాలను కాపాడాలని గ్రామస్తులు కోరారు.

పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్య

మిడ్జిల్: మండలంలోని బైరంపల్లికి చెందిన వివాహిత బండారి పెంటమ్మ(34) ఆదివారం అర్ధరాత్రి పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించగా సోమవారం మృతి చెందింది. తరుచూ అనారోగ్య సమస్యలతో బాధపడుతుండగా జీవితం మీద విరక్తి చెంది పురుగు మందు తాగినట్లు గ్రామస్తులు తెలిపారు. భర్త రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

బైక్‌పై నుంచి పడి యువకుడి దుర్మరణం

పెబ్బేరు రూరల్: బైక్‌పై నుంచి కిందపడి యువకుడు దుర్మరణం చెందిన ఘటన వనపర్తి మండలం పెద్దగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. కొత్తకోట మండలం మిరాసిపల్లికి చెందిన బోయ దినేష్ (25), స్నేహితుడు గణేష్ బైక్‌పై వనపర్తి నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా.. పెద్దగూడెం శివారులోని డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. దినేష్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. గణేష్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆన్‌లైన్‌లో డబ్బులు పోయాయని.. యువకుడి బలవన్మరణం

జడ్చర్ల: అప్పులు తీర్చే మార్గం లేక ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. దామరగిద్ద మండలం కంసాన్‌పల్లికి చెందిన గోఖం జనార్దన్(23) తన భార్య జ్యోతితో కలిసి పోలేపల్లిలో అద్దె ఇంటిలో నివాసం ఉంటూ హెటిరో ఫార్మ కంపెనీలో ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడేందుకు డబ్బులు ఖర్చు చేస్తున్నాడు. ఇతరుల వద్ద అప్పులు చేసి ఆడేవాడు. అప్పులు ఇచ్చిన వారు ఒత్తిడి తేవడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు

బాలికపై అత్యాచారం: కేసు నమోదు

ధన్వాడ: బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమేష్ కథనం ప్రకారం.. ధన్వాడకు చెందిన భాను స్థానికంగా ఈ నెల 16న రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉన్న బాలిక(14)కు మాయమాటలు చెప్పి బయటకు తీసుకెళ్లాడు. మరుసటి రోజు 17న రాత్రి బాలికను ఇంటికి పంపించాడు. ఇంటికి వచ్చిన బాలికను తల్లి ప్రశ్నించగా జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఉరేసుకుని యువకుడు బలవన్మరణం

తెలకపల్లి: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. హెడ్‌కానిస్టేబుల్ పరశురాములు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరుకు చెందిన బెల్లె రాములు(24) ఖాళీగా తిరిగేవాడని తెలిపారు. పని చేయకుండా ఎందుకు ఉన్నాయని తల్లిదండ్రులు పది రోజుల క్రితం రాములును మందలించారు. ఈ నెల 15న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం ఆలయ గ్రామ శివారులో కోళబండ వద్ద నర్లేంగ చెట్టుకు ఉరేసుకున్నాడు. తండ్రి బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

వైభవంగా రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు


ఆలయంలో ధ్వజారోహణ నిర్వహిస్తున్న అర్చకులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురంలో రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. ధ్వజస్తంభంపై గరుడ పతాకం ఎగురవేసి, బ్రహ్మోత్సవాలకు తరలిరావాలని ముక్కోటి దేవతలకు ఆహ్వానం పలికారు. అనంతరం యజ్ఞం, భేరి పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీచేశారు. కార్యక్రమంలో అర్చకులు విష్ణునారాయణ, కన్నయ్యశర్మ, గోవిందాచార్యులు, సురేశాచార్యులు పాల్గొన్నారు.

లెక్చరర్ సుభాషిణికి 'మహిళా సాధికారిక' అవార్డు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డా బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు సుభాషిణికి మహిళా సాధికారిక అవార్డు దక్కింది. మహిళా సాధికార విభాగం కన్వీనర్‌గా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమాలను గుర్తించి.. సేవ్ గర్ల్‌చైల్డ్, ముందడుగు ఫౌండేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో అవార్డును ప్రదానం చేశారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ, అధ్యాపక బృందం ఆమెను అభినందించారు.


అవార్డుగ్రహీత సుభాషిణిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మార్కెట్‌లోకి హీరో ఎక్స్‌ట్రీమ్ 125ఆర్

పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని అశ్విని హీరో షోరూంలో సోమవారం హీరో ఎక్స్‌ట్రీమ్ 125ఆర్ మోడల్ ద్విచక్రవాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూం మేనేజర్లు అజీమ్, రాజశేఖర్ మాట్లాడుతూ ఈ బైక్‌కు అన్ని ఎల్ఈడీ బల్బులు అమర్చినట్లు చెప్పారు. ఇది స్పోర్ట్స్ బాడీ డిజైన్స్‌తో ప్రోగ్రామ్డ్ ఫ్యూయల్ ఇంజెక్షన్, ఇంజిన్ బాలన్సర్ టెక్నాలజీ కలిగి ఉందన్నారు. 0 నుంచి 60 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 5.9 సెకన్లలో అందుకుంటుందన్నారు. డిజిటల్ మీటర్‌తోపాటు బ్లూటూత్ కనెక్టివిటి, ఆర్‌టీఎంఐ మొబైల్ చార్జింగ్, ప్రొజెక్టడ్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్, ఏబీఎస్ టెక్నాలజీ వంటి ఎన్నో అత్యాధునిక ప్రత్యేకతలు ఈ బైక్‌లో ఉన్నాయని చెప్పారు. ఈ నూతన బైక్ మార్కెట్‌లో మూడు రంగులలో లభిస్తోందని, దీని ఎక్స్ షోరూం ధర రూ.1,02,020 ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ మెకానిక్ సంఘం అధ్యక్షుడు సిద్దేశ్వర్, బాలరాజు, శ్రీరామ్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు హాజరు

దేవరకద్ర: కన్నతండ్రి తనువు చాలించినా ఓ విద్యార్థి పుట్టెడు దుఃఖంలోనూ పదో తరగతి పరీక్షకు హాజరయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. దేవరకద్రకు చెందిన కుర్వ హన్మంతు అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. అతడి కుమారుడు అజయ్ పుట్టెడు దుఃఖంలోనూ పరీక్షకు హాజరయ్యాడు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసిన అనంతరం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. విద్యార్థి పరిస్థితిని చూసి పలువు రు కంటతడి పెట్టారు.


పరీక్షకు హాజరైన విద్యార్థి అజయ్

రైతు సబ్సిడీలకు నిధులివ్వండి


నాబార్డ్ సంస్థ ప్రతినిధులు, ఉమ్మడి జిల్లాల డీసీసీబీ డైరెక్టర్‌ల సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్‌గుప్తా

- ఎడ్యుకేషన్ లోన్‌ను రూ.60లక్షలకు పెంచాలని వినతి
- నాబార్డ్ సంస్థను కోరిన ఉమ్మడి జిల్లాల డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌గుప్తా

కడ్తాల్: సరైన సమయంలో రైతులకు సబ్సిడీలు అందేలా నాబార్డ్ సంస్థ బ్యాంకర్లకు నిధులు అందించాలని ఉమ్మడి జిల్లాల డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా ఆ సంస్థ ఉన్నతాధికారులను కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో నాబార్డ్ ఉన్నతాధికారులు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల డీసీసీబీ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. స్వయం సహకార సంఘాల బ్యాంకుల, రైతుల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో ఎకరా భూమి విలువ మార్కెట్‌లో రూ.కోటి నుంచి రూ.3 కోట్ల వరకు పలుకుతోందని సంస్థ ఇచ్చే రూ.1.50లక్షలు సరిపోవడం లేదన్నారు. లాంగ్‌టైం(ఎల్‌టీ) రుణాలు రూ.10 లక్షల వరకు పెంచాలని కోరారు. ఐదు నుంచి 10 ఎకరాలు ఉన్న రైతులకు రూ.40 లక్షల నుంచి రూ.కోటి వరకు రుణాలు ఇవ్వాలని, ఎడ్యుకేషన్ లోన్ డీసీసీబీ నుంచి రూ.60 లక్షలకు పెంచాలని నాబార్డ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. సహకార సంఘాల ద్వారా ఇచ్చే రుణాలపై పరిమితి విధించడంతో రైతులు ప్రైవేట్ బ్యాంకులను ఆశ్రయించి నష్టపోతున్నారన్నారు. నాబార్డ్ నుంచి అందించే రుణాలు, సబ్సిడీల చెల్లింపు అమలులో సహకార సంఘాల పాలకవర్గాలను భాగస్వాములను చేయాలని కోరామన్నారు. సబ్సిడీలను త్వరితగతిన అందేలా చూడాలన్నారు. ఇందుకు సంస్థ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారని, మార్చి చివరిలో ఆర్థిక సంవత్సరంలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని నాబార్డ్ ప్రతినిధులు వెల్లడించినట్లు వివరించారు. సమావేశంలో నాబార్డ్ సీజీఎం చింతల సుశీల, ఆర్‌బీఐ సీజీఎం ప్రబోటి, సమల్, నాబార్డ్ జీఎం ఉష, డీసీసీబీ చైర్మన్ వెంకటయ్య, సీఈఓ లక్ష్మీనారాయణ, ఉమ్మడి జిల్లాల డైరెక్టర్‌లు పాల్గొన్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

'ప్రగతిశీల సమాజ్' అభ్యర్థిగా అబ్దుల్ ఖాదర్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రగతిశీల సమాజ్ పార్టీ అభ్యర్థిగా మహబూబ్‌నగర్ పార్లమెంటు నుంచి పోటీ చేయనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలోని మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్ సహా 4 నుంచి 6 నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులతో సమావేశం నిర్వహించినట్లు, జాతీయ అధ్యక్షుడు సునీల్‌కుష్వాహకు నివేదిక పంపి రెండు మూడు రోజుల్లో జాతీయ నాయకత్వం నుంచి అందే ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

నవాబుపేట: మండల పరిధిలోని గురుకుంట సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో హన్వాడ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన కేశవులు(32) గాయపడ్డాడు. నవాబుపేట నుంచి గురుకుంట వైపు వెళ్తుండగా బైక్ అదుపుతప్పడంతో ప్రమాదం చోటు చేసుకుంది. కాగా అటుగా వెళ్తున్న మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గమనించి బాధితుడిని 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు.

జడ్చర్ల పరిధిలో బాలుడికి..

జడ్చర్ల: మండల పరిధిలోని కోడ్గల్– లింగంపేట గ్రామాల మధ్య రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు(13) తీవ్రంగా గాయపడ్డాడు. ఎదురుగా వచ్చిన ఆటోను ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న సదరు బాలుడికి గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స కోసం జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా బాలుడు లింగంపేట వాసిగా గుర్తించారు.

బాధిత కుటుంబానికి సాయం

నవాబుపేట: కిషన్‌గూడకు చెందిన ముర్గని వెంకటమ్మ(79) సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. కాగా బాధిత కుటుంబానికి జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి రూ. 5 వేలు ఆర్థికసాయం అందించారు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్, చెన్నయ్య, నరేష్, అంతయ్య, దశరథ్ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

మురుగుగుంతను పూడ్చివేయండి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 22వ వార్డు పరిధిలోని మధురానగర్‌కు వెళ్లే దారిలో కుడివైపు ఉన్న పెద్ద మురుగుగుంతను పూడ్చివేయాలని స్థానికులు సోమవారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌ను చాంబర్‌లో కలిసి విన్నవించారు. అందులో మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోందని, దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఆ మురుగును మెయిన్ రోడ్డు లోని కాజ్‌వే ద్వారా కిందికి వెళ్లేలా చూడాలని కోరారు. అనంతరం వారితో పాటు ఆయన అక్కడికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. మురుగు నిల్వ కాకుండా వెంటనే జేసీబీతో కాజ్‌వే ద్వారా కిందికి మళ్లిస్తామన్నారు. ఎంపీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత భూత్పూర్ మెయిన్ రోడ్డు వెంట డ్రెయిన్ నిర్మించి ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఇదిలాఉండగా గత ఏడాది జూన్ 12న సాక్షి దినపత్రికలో ఇదే విషయం 'వార్డు వాచ్'లో భాగంగా ప్రచురితమైంది.

విద్యార్థుల పోరాటాల ఫలితమే కళాశాలలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ విద్యార్థుల పోరాట ఫలితంగానే కొత్తగా లా, ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుపై ప్రతిపాదలను ప్రభుత్వం కోరిందని పీయూ జేఏసీ చైర్మన్ బత్తిని రాము పేర్కొన్నారు. ఈమేరకు కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కోరిన ప్రతిపాదనలను వీలైనంత త్వరగా పీయూ అధికారులు పంపించాలని, అన్ని కోర్సులను రెగ్యులర్ పరిధిలోనికి తీసుకువచ్చి, రెగ్యులర్ అధ్యాపకులు సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కళాశాల ఏర్పాటు కోసం కృషి చేసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి, వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్‌కు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, గణేష్, జగదీష్, ఆంజనేయులు, లేపాక్షి, వంశీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షలు ప్రారంభం



నవాబుపేటలో సరస్వతి దేవి విగ్రహం వద్ద విద్యార్థులు



బాదేపల్లి కేంద్రం వద్ద ..



మహమ్మదాబాద్‌లో..

సాక్షినెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా సోమవారం పదోతరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి.

నవాబుపేటలో విద్యార్థులు చదువుల తల్లి సరస్వతీ దేవి విగ్రహానికి పూజలు చేశారు. మండలంలో మూడు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 621 మందికి గానూ 5 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ రాజునాయక్ తెలిపారు.

మహమ్మదాబాద్ పరిధిలోని కేంద్రాల్లో 553 మందికి గానూ.. 551 మంది హాజరయ్యారు.

గండేడ్ పరిధిలో వెన్నాచేడ్ బాలుర, గండేడ్ బాలుర ఉన్నత పాఠశాలల్లో సెంటర్లు ఏర్పాటు చేయగా 421 మందికి గానూ ముగ్గురు గైర్హాజరయ్యారు.

అడ్డాకులలో 251 మందికి ఇద్దరు, మూసాపేటలో 170 మందికి ఒకరు, జానంపేటలో 226 మందికి ఒకరు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

భూత్పూర్ పరిధిలో 502 మందికి గానూ ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈఓ నాగయ్య తెలిపారు.

దేవరకద్రలో మూడు పరీక్షా కేంద్రాలలో మొత్తం 711 మందికి 709 మంది విద్యార్థులు హాజరయ్యారు.

కౌకుంట్లలో 107 మంది పరీక్షలు రాశారు.

చిన్నచింతకుంట మండలంలో 481 మందికి 477 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

జడ్చర్ల పరిధిలోని 8 కేంద్రాల్లో 1828 మంది విద్యార్థులకు గానూ ముగ్గురు గైర్హాజరయ్యారు. తొలిరోజు కావడంతో విద్యార్థులు కేంద్రాలకు గంట ముందుగానే చేరుకుని హాల్‌టికెట్ నంబర్లు చూసుకున్నారు.

మిడ్జిల్ పరిధిలోని రెండు కేంద్రాల్లో మొత్తం 302 మందీ పరీక్షలు రాసినట్లు అధికారులు తెలిపారు.

రాజాపూర్ మండల పరిధిలో మొత్తం 213 మందికి గానూ ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

బాలానగర్ పరిధిలోని మూడు కేంద్రాలలో మొత్తం 631 మందికి గానూ 629 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. ఎంఈఓ వెంకటయ్య మూడు సెంటర్లను తనిఖీ చేశారు.



చిన్నచింతకుంటలో. .



భూత్పూర్ ఉన్నత పాఠశాలలో ..



రాజాపూర్‌లో పోలీసుల బందోబస్తు

ఎన్నికల నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ నవీన్

మహబూబ్‌నగర్ రూరల్: ఎన్నికల కమిషన్ కోడ్‌ను అమలోకి తెచ్చిన నేపథ్యంలో అధికారులు, సిబ్బంది విధివిధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆర్డీఓ నవీన్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరియల్ ఆఫీసర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్త ఓటర్ల నమోదుకు ఏప్రిల్ 15 వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించినట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండి, ఇప్పటి వరకు ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోని వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఓటరు జాబితాలో తప్పొప్పులు సరిచేసుకోవడం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ప్రస్తుతం నివాసం ఉన్న చోట ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి మూడు నెలలకోసారి ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని, జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెల 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం ఇటీవల విడుదల చేసిన తుది జాబితాలో తమ పేర్లు లేని వారు తిరిగి నమోదు చేసుకోవచ్చని, ఇందుకోసం ఫారం–8 దరఖాస్తును ఆన్‌లైన్‌లో కానీ, నియోజకవర్గ ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారి, బూత్‌స్థాయి అధికారికి ప్రత్యక్షంగా లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ ఘన్సీరాం, డిప్యూటీ తహసీల్దార్లు దేవేందర్, సునీల్, గిర్దావర్లు నర్సింగ్, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి ముకుందరెడ్డి



మానవహారంలో పాల్గొన్న అధ్యాపకులు, అధికారులు

దేవరకద్ర: ఓటరు నమోదుకు మరోసారి అవకాశం వచ్చిందని ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటర్ల నమోదు ఉంటుందని అధికారులు దృష్టి సారించాలని దేవరకద్ర రిటర్నింగ్ అధికారి ముకుందరెడ్డి సూచించారు. సోమవారం దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో ఆయన సమావేశం అయ్యారు. బీఎల్‌ఓలను అప్రమత్తం చేయాలని అందరు విధులకు హాజరు అయ్యేలా చూడాలని పోలింగ్ బూత్‌ల వద్ద కొత్త ఓటరు నమోదుకు దరఖాస్తులు తీసుకోవాలని పేర్కొన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎన్నికల డీటీ రహమాన్, డీటీలు శివరాజు, దీపిక తదితరులు పాల్గొన్నారు.

ఓటరు చైతన్యంపై మానవహారం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో ఓటరు చైతన్యంపై మానవహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు కార్యక్రమంలో డీఐఈఓ శ్రీధర్ సుమన్ మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో విద్యార్థులకు ఓటరుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున ప్రజల్లో అవగాహన పెంచుతామని, 18 సంవత్సరాలు దాటిన యువత ఓటరుగా నమోదు చేసుకుని ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో అధ్యాపకులు భగవంతాచారీ, ఉమామహేశ్వర్, రాజేశ్వర్‌రావు, నర్సింహ్మారెడ్డి, రామకృష్ణగౌడ్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

పౌరసత్వ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం సంఘాల నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)ను రద్దు చేయాలని కోరుతూ ఆల్‌పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రపతికి రాసిన వినతిపత్రాన్ని సోమవారం జిల్లా కేంద్రం ఐడీఓసీ బిల్డింగ్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో అధికారికి అందజేశారు. ఈ సందర్భంగా ఆల్‌పార్టీ ముస్లిం లీడర్స్ కోఆర్డినేషన్ కమిటీ జిల్లా కన్వీనర్ మోసీన్‌ఖాన్ మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన సీఏఏ చట్టం సరికాదన్నారు. ఒక వర్గానికి వ్యతిరేకంగా ఉందనే ఆరోపణలు దేశవ్యాప్తంగా ఉన్నాయని అన్నారు. ముస్లిం శరణార్థులను మినహాయించడం ఆందోళనకు గురిచేస్తుందన్నారు. ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హాదీ, ప్రధాన కార్యదర్శి జాకీర్ అడ్వకేట్, వివిధ పార్టీల నాయకులు సమద్‌ఖాన్, మిర్జా ఖుద్దూస్‌బేగ్, నూర్‌ఖాన్, యూసుఫ్ బిన్ నాసర్, అజ్మత్‌అలీ, అవేజ్, కలీం సాబేరి, హామెద్‌ఖాన్, మజహర్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి



చిరుధాన్యాలు, పండ్ల ప్రదర్శన

మహబూబ్‌నగర్ రూరల్: పిల్లలకు పోషకాలతో కూడిన బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరితా రాణి కోరారు. సోమవారం మండల పరిధిలోని కోటకదిర గ్రామంలో గల 2, 4వ అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా చిరుధాన్యాలు ప్రాముఖ్యతను వివరించారు. పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డా క్షేమంగా ఉంటారని అన్నారు. అనంతరం పోషణ అభియాన్‌పై చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. అంగన్‌వాడీ టీచర్లు వెంకటమ్మ, భారతమ్మ, రజిత, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జీవవైవిధ్య సంరక్షణ అందరి బాధ్యత



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: భూమిపై జీవవైవిధ్యాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పీయూ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో లైఫ్‌సైన్సెస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఒక్కరోజు జాతీయ స్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశ్వంలో భూమి మీద మాత్రమే చెట్లు, మానవులు, జంతువులు నివసించేందుకు ఆస్కారం ఉందన్నారు. ఎన్నో అద్భుతాలకు భూమి ఆలవాలం అని, అటువంటి భూమిని కాపాడుకునే బాధ్యత అందరి పై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, కన్వీనర్ అమీనా ముంతాజ్, పాల్గొన్నారు.

ఆలయం వద్ద అన్నదానం

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రసిద్ధి చెందిన ఈశ్వర వీరప్పయ్యస్వామి ఆలయాల వద్ద సోమవారం భక్తులకు అన్నదానం చేశారు. దేవరకద్రకు చెందిన వి.మధుసూదన్‌రావు, భాగ్యలక్ష్మి దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూజారులు నాగరాజు, నాగభూషణం, జేఏ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్‌కేంద్రం వద్ద తహసీల్దార్ సి.కృష్ణయ్య

చిన్నచింతకుంట: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సి.కృష్ణయ్య సోమవారం పరిశీలించారు. మండలంలోని బండ్రపల్లి, లాల్‌కోట, నెల్లికొండి, వడ్డేమాన్, ఏదులాపూరం, చిన్నచింతకుంట పోలింగ్ కేంద్రాలల్లో విద్యుత్, మూత్రశాలలు, ఫర్నీచర్ తదితర వసతులపై పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ శశి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



అడ్డాకుల: మండలంలోని కందూర్ గ్రామంలో జములమ్మ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. కాగా ఇటీవల ఆలయ పునర్నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా పండితుడు తాళ్లపాక మణికంఠ శివాచార్య ఆధ్వర్యంలో పూజారులు ఉదయం భూతబలి, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వరపూజ, దీక్షాధారణ, అఖండస్థాపన చేశారు. సాయంత్రం అగ్నిప్రతిష్ఠాపన, ధ్వజారోహణ, బలిహరణ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈనెల 20న ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

జడ్చర్ల: వరిలో కాండం తొలుచు పురుగులు, అగ్గి తెగులు నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణ బాబు రైతులకు సూచించారు. సోమవారం నసరుల్లాబాద్ తండాలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించగా పాల్గొని మాట్లాడారు. రైతులకు సుడామోనస్, కార్ఫ్, వేప నూనె, లింగాకర్షక బుట్టలు, కార్టప్ గుళికలు(4జీ) ఉచితంగా పంపిణీ చేశారు. ఏరువాక కోఆర్డినేటర్ భరత్ భూషణ్, మండల వ్యవసాయ అధికారి గోపీనాథ్, ఏఈఓ సాయికుమార్, మాజీ సర్పంచ్ రాజేశ్, అగ్గిరామ్, తదితరులు పాల్గొన్నారు.



'ఉపాధి' కూలీల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

జడ్చర్ల టౌన్: ఉపాధికూలీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ నేతృత్వంలో సోమవారం ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. మండలంలోని 15గ్రామాల్లో కూలీల వద్ద సర్వే నిర్వహించిన అనంతరం కూలి పనివద్ద రెండుపూటల ఫొటో విధానాన్ని రద్దుచేయాలని, కొలతల విధానాన్ని తొలగించాలని కోరారు. ఉపాధి కూలీలకు కేంద్రబడ్జెట్‌లో కోతలు విధించటం సరికాదన్నారు. పనిప్రదేశాల్లో పార, గడ్డపార, గొడ్డలి, కొడవలి, తట్టలు పనిముట్లు ఇవ్వడం లేదన్నారు. అదేవిధంగా టెంటు సౌకర్యం కల్పించటం లేదన్నారు. గ్రామం నుంచి పనిప్రాంతానికి వెళ్లాలన్నా, రావాలన్నా రవాణా సౌకర్యం కల్పించటం లేదన్నారు. సమస్యలపై వెంటనే నిర్ణయం తీసుకుని పరిష్కరించాలన్నారు. మండల అధ్యక్షుడు ఆండాలు, కార్యదర్శి ఈర్లపల్లి యాదయ్య, ఉపాధ్యక్షుడు పాండు పాల్గొన్నారు.

ఎంపీఓపై దాడి అమానుషం



చిన్నచింతకుంటలో నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు



బాలానగర్‌లో..

చిన్నచింతకుంట: నాగర్‌కర్నూల్ జిల్లా కోడేర్ మండలం ఎంపీఓ శ్రావణ్‌పై ఎంపీపీ కొండ వెంకటరాధ దాడి చేయడం అమానుషమని.. ఇట్టి చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని చిన్నచింతకుంట మండల ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ మోషిన్, ఎంపీఓ అనీల్ అన్నారు. దాడిని నిరసిస్తూ సోమవారం స్థానిక కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో పంచాయతీ కార్యదర్శులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం సమంజసం కాదన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాలానగర్: కోడేరు మండల పరిషత్ అధికారిపై దాడిచేయడం హేయమైన చర్య అని బాలానగర్ ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది అన్నారు. సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయ కుమారి, కార్యాలయ సూపరింటెండెంట్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లగడ్డ బీటీరోడ్డు పనులెప్పుడు..?

- ఆరు నెలలైనా మొదలు కాని పనులు
- అసంపూర్తిగా బ్రిడ్జి పనులు
- ఇబ్బందుల్లో వాహనదారులు



అసంపూర్తిగా మిగిలిన బ్రిడ్జి పనులు



జానంపేట నుంచి తాళ్లగడ్డకు వెళ్లే రోడ్డు


బీటీరోడ్డు పనులు చేపట్టాలి



మా ఊరికి జానంపేట నుంచి బీటీరోడ్డు వేయడానికి నిధులు మంజూరైనా ఇంకా పనులు మొదలు పెట్టలేదు. ప్రస్తుతం ఉన్న రోడ్డుపై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి పనులు కూడా ఇంకా పూర్తి కాలేదు. బీటీరోడ్డు పనులను వెంటనే చేపట్టాలి.

–గంగాధర్‌గౌడ్, తాళ్లగడ్డ

వారం రోజుల్లో ప్రారంభిస్తాం



తాళ్లగడ్డ బీటీరోడ్డు పనులకు సంబంధించిన టెండర్లు పూర్తయ్యాయి. కాంట్రాక్టర్ ఇంకా పనులను మొదలు పెట్టలేదు. వారం, పది రోజుల్లో బీటీ రోడ్డు పనులను మొదలు పెట్టిస్తాం. అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి పనులు కూడా పూర్తయ్యేలా చర్యలు చేపడతాం.

–లక్ష్మణ్‌గౌడ్, పీఆర్ ఏఈ, మూసాపేట

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట అనుబంధ గ్రామమైన తాళ్లగడ్డ బీటీరోడ్డు పనులు మొదలు కావడం లేదు. జానంపేట నుంచి తాళ్లగడ్డ వరకు సుమారు 2.8కిలోమీటర్ల దూరం ఉండగా చెరువు కట్ట మీదుగా రోడ్డు ఉంది. దీన్ని బీటీరోడ్డుగా మార్చేందుకు గత ప్రభుత్వ హయాంలో రూ.2.50కోట్లు మంజూరయ్యాయి. గత ఎన్నికల కంటే ముందు అక్టోబర్ నెల మొదటి వారంలో బీటీరోడ్డు పనులను ప్రారంభించి వదిలేశారు. ఇప్పటి వరకు రోడ్డు పనులు మొదలు కావడం లేదు. టెండర్లు పూర్తయినా కాంట్రాక్టర్ పనులను చేపట్టడం లేదు. ఆరు నెలలైనా పనులు మొదలు కాకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వేసవికాలం ముగిస్తే వచ్చే వర్షాకాలంలో మట్టిరోడ్డుతో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి బీటీరోడ్డు పనులు త్వరగా పూర్తి చేసే విధంగా చొరవ తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అసంపూర్తిగా బ్రిడ్జి పనులు

జానంపేట నుంచి తాళ్లగడ్డ వెళ్లే దారిలో చెరువు కట్ట చివర ఉన్న అలుగు వద్ద ఇప్పుడున్న రోడ్డు మీదనే చెరువు నీళ్లు దిగువకు వెళ్తాయి. దీంతో ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.1.25కోట్లు మంజూరయ్యాయి. బ్రిడ్జి పనులను దక్కించుకున్న మరో కాంట్రాక్టర్ గతేడాది ఏప్రిల్ 2న పనులు చేపట్టినా అవి ఇంకా పూర్తి కాలేదు. ప్రధాన బ్రిడ్జి పనులు పూర్తయినా రెండు చివర్లో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. బ్రిడ్జి చివర కొంత భూమి సమస్యతో పాటు మిషన్ భగీరథ పైప్‌లైన్ మార్చే పని ఉండటంతో పనులు ముందుకు సాగడం లేదు. వర్షాకాలంలో చెరువు నిండితే ఇక్కడ పనులు చేపట్టడం వీలు కాకపోవచ్చు. ఈనేపథ్యంలో అసంపూర్తి పనులు పూర్తయ్యే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.